# పెళ్లి

జి.పి.కరుణాకర్




బాబ్జి గదిలో అలారం గడియారం మోగుతుంటే నాకు మెలకువ వచ్చింది. అయిదయింది. లేచి షూర్చుని దుప్పటి తీశాను. కిటికీలోంచి చల్లటిగాలి వీస్తోంది.

మంచం ప్రక్కనే ఉన్న బల్ల సొరుగు లోంచి చుట్ట బయటకు తీశాను. చివరి భాగం కొరికి చుట్ట వెలిగించాను. సాధారణంగా నాకు నాలుగు గంటలకే మెలకువ వస్తుంది అయిదింటి వరకు నిద్రపోను. రాత్రి ఆలస్యంగా నిద్రపోవటం వలన అలారం మోగుతుంటేగాని మెలకువ రాలేదు.

బాబ్జీ గదిలో లయిటు వెలిగింది. వెంటిలేటరులోంచి వెలుగు కుప్పగా నా గదిలో పడింది. బాబ్జిని చూస్తుంటే నాకు జాలి వేస్తుంటుంది. ఉదయాన్నే లేచి బాయిలర్ వెలిగిస్తాడు పాలు కాచి కాఫీ తయారు చేస్తాడు. వంట చేస్తాడు. పిల్లల్ని నిద్ర లేపి స్నానాలు చేయించి బడికి పంపిస్తాడు. వాడు ఫేక్టరీకి బయల్దేరే సమయానికిగాని నా కోడలు అనసూయ నిద్రలేవదు.

అనసూయ బద్ధకంలో నా భార్యకేమీ తీసిపోదు. నా భార్య బ్రతికి ఉండగా ఆవిడ డామినేషన్ తట్టుకుంటూ సౌఖ్యంగా నేను గడిపిన రోజులు చాలా తక్కువ. బాబ్జి నాకులా కాకుండా ప్రతి విషయంలోనూ సర్దుకుపోతుంటాడు. మొదట్లో నేను ఏ విషయంలోనూ ఒకపట్టాన రాజీపడేవాడిని కాదు. రెండు సంవత్సరాల క్రిందట గుండెపోటు వచ్చాక నేను సగం చచ్చిపోయాను. నేనిప్పుడు ప్రతి విషయంలోనూ రాజీపడిపోతుంటాను నాకు అరవయి సంవత్సరాలు నిండాయి.

తలుపు గడియతీస్తున్న చప్పుడు వెనకే తలుపు తెరుచుకుంది. బాబ్జి నా గదిలోకి వచ్చి స్విచ్ నొక్కాడు. లయిటు వెలిగింది.

బాబ్జి నా మంచం దగ్గరకు వస్తూ "నాన్నా! మీరు లేచి ఎంతసేపయింది?" అడిగాడు.

"అయిదు నిమిషాలు అవుతుంది" అని మంచం దిగి లేచి నిలబడ్డాను. ఆరిపోయిన

చుట్టమ కిటికీ అంచున పెట్టి ముఖం కడుక్కొనేందుకు స్నానాల గదిలోకి నడిచాను.

ముఖం కడుక్కొని బయటకు వచ్చేసరికి బాబ్జి కాఫీ తయారుచేసి తీసుకువచ్చి కప్పు నాకు అందించాడు. కాఫీ అంత వేడిగా లేదు. మవునంగా కప్పు ఖాళీచేసి బాబ్జికి తిరిగి ఇచ్చేస్తోంటే నవ్వుతూ, "ఎక్కడికి బయల్దేరారు?" అడిగాడు.

బాబ్జి ముఖంలోకి చూశాను ఇంట్లోంచి బయల్దేరుతున్నప్పుడు ఎవరయినా ఎక్కడికని అడిగితే నాకు చిరాకు వేస్తుంటుంది. ఉదయం కాఫీ తాగిన తర్వాత రెండు మూడు మయిళ్ళు నడవటం నాకు అలవాటనీ బాబ్జికి తెలిసినా ఎందుకు అ ప్రశ్న వేశాడో నాకు తట్టలేదు మంచంమీదున్న మఫ్లర్ భుజంమీద వేసుకుని చేతికర్ర అందుకున్నాను "అలా యూనివర్సిటీ వరకు " అని అంటుంటే బాబ్జి నా మాటలకు అడ్డుతగిలి "మీరు స్టేషన్‌కు వెళ్ళరా?" అడిగాడు.

"స్టేషన్‌కా, ఎందుకు?" అడిగాను.

"ఇవెళ అయిదో తేదీ కదా?"

"అవును."

"మీ బొంబాయి స్నేహితుడు దశరథం గారు అయిదున బొంబాయినుంచి ఇక్కడకు వస్తున్నారని నాలుగయిదు రోజుల క్రిందట మీరే అన్నారు అయన్ని రిసీవ్ చేసుకోవటానికి మీరు స్టేషన్‌కు వెళ్లరా?"

చెప్పులు తొడుక్కొంటూ అగి పోయాను. బాబ్జిమీద కలిగిన చిరాకుకు నొచ్చుకుంటూ, "దశరథం వస్తున్న సంగతే మర్చిపోయానురా. బొంబాయి ఎక్స్‌ప్రెస్ ఎన్ని గంటలకు వస్తుంది?" అడిగాను.

"అరుగంటలకనుకుంటాను."

"నువ్వు గుర్తు చేసి ఉండకపోతే మార్నింగ్ వాక్‌కు వెళ్ళిపోయి ఉండే వాడిని. నాకీమధ్య మతిమరుపు ఎక్కువవుతోందిరా స్టేషన్‌కు వెళ్ళవస్తాను" అని చెప్పులు తొడుక్కొని బయటకు వచ్చాను

* * *

దశరథానికీ నాకూ ఉన్న స్నేహం ఇప్పటిది కాదు. ముప్పయి అయిదేళ్ళ క్రిందటినుండి ఉంది నేను యుక్తవయసులో ఉండగా నాకు ఎందరో స్నేహితులు ఉండేవాళ్ళు. కాలప్రవాహంలో కొందరు నన్ను వదిలించుకున్నారు. మరి కొందరిని నేను వదిలివేశాను దశరథం మినహా నాకు మంచి మిత్రులు అని చెప్పుకోతగినవాళ్ళు ఎవరూ లేరు ఒక వయసు దాటినతర్వాత స్నేహితులను సంపాయించుకోవటం నా మటుకు నాకు తేలికయిన పనిలా అనిపించలేదు.

అతనూ, నేను ముప్పయి అయిదేళ్ళ క్రిందట బొంబాయిలో ఒకే అఫీసులో పనిచేశాం. కొన్నాళ్ళపాటు ఒకే గదిలో ఉన్నాం. అతనిది విశాఖపట్టణం దగ్గిర చిన్న పల్లెటూరు. మూడు, నాలుగు

సంవత్సరాలకు ఒకసారి వాళ్ళూరు వెళ్ళేప్పుడు, తిరిగి వచ్చేప్పుడు మర్చిపోకుండా మధ్యలో ఆగి మా ఇంట్లో రెండు రోజు లయినా గడపకుండా పోడు. వయసులో అతడు నాకన్నా నాలుగయిదు సంవత్సరాలు చిన్నవాడయినా చూడటానికి నాకంటే పెద్దవాడిలా కనిపిస్తుంటాడు. బ్రహ్మచారి అతను ఇక్కడ ఉన్నన్ని రోజులు నాకెంతో హాయిగా ఉంటుంది. అతను నా దగ్గిర మరిన్ని రోజులుంటే బావుండనిపిస్తుంటుంది అతను రెండు రోజులకు మించి ఉండడు. నన్ను ఎన్నో సార్లు బొంబాయికి రమ్మని ఆహ్వానించినా వెళ్ళలేకపోయాను. నాకు ప్రయాణాలంటే ఎలర్జీ. ఇల్లూ, పార్కు గ్రంథాలయం తప్ప ఎక్కడికి వెళ్ళాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. ఏకాంతంలోని ఆనందం నాకు ఎక్కడా దొరకదు

బొంబాయి నేవీ ఆఫీసులో యు.డి సిగా చేరినప్పుడు నాకు మొట్టమొదటగా పరిచయం చేయబడిన తెలుగువాడు దశరథం. నన్ను అతను పనిచేస్తున్న సెక్షన్‌లోనే వేశారు. ముందు అతన్ని చూడగానే నాకు అసహ్యం వేసినమాట అబద్ధంకాదు. మనిషి వామనఛాయలో ఉన్నాడు. అంత పొడుగూ కాదూ, పొట్టి కాదు. పన్నగా ఉన్నాడు కోల ముఖం, పెద్ద నుదురు. పొట్టి ముక్కు. క్రింద పెదవి లావుగా నల్లగా ఉంది. పళ్ళు ఎత్తుగా ఉండి చిగుళ్ళు బయటకు అవుపిస్తున్నాయి. రెండుమూడు నిమిషాలకు ఒకసారి నాలుకతో క్రింద పెదవిని తడుపుకుంటుంటాడు

నేను ఉద్యోగంలో చేరిన మధ్యాహ్నం నా దగ్గిరకు వచ్చి, "రండి. బయటకు వెళ్ళి టీ తాగివద్దాం" అన్నాడు.

ముందు అతనితో బయటకు వెళ్ళటానికి నాకు మనస్కరించలేదు. రెండు క్షణాలు తటపటాయించి, "ఇప్పుడే కేంటీన్‌లో టీ తాగి వచ్చాను" అన్నాడు.

అతను నవ్వాడు నవ్వినప్పుడు అతను మరింత వికృతంగా అవుపించాడు పళ్ళు బయటకు వచ్చాయి నాలుకతో క్రింద పెదవిని తడుపుకుని "మన కేంటీన్ టీ కన్నా బయట టీ బావుంటుంది. రండి" అన్నాడు. అని, నా జవాబుకయి ఎదురు చూడకుండా వరండాలోకి నడిచాడు.

ఇహ నాకు తప్పలేదు చేస్తున్న పని ఆపి లేచి అతనిని అనుసరించాను. మా ఆఫీసుకు అరఫర్లాంగు దూరంలో ఉన్న ఇరానీ హోటల్‌లో కూర్చున్న తర్వాత అడిగాడు. "టిఫిన్ ఏమన్నా తీసుకుంటారా!"

తల అడ్డంగా ఆడించాను. "వద్దు. ఆఫీసుకు వచ్చేముందే భోజనం చేసి వచ్చాను. ఇప్పుడు ఆకలిగా లేదు" అన్నాను.

రెండు టీలకు ఆర్డరిచ్చాడు. సిగరెట్ పెట్టెతీసి నాకు ఒకటి ఆఫర్‌చేసి తనొకటి తీసుకుని వెలిగించాడు.

"మీరు బొంబాయి రావటం ఇదే మొదటిసారా?" అడిగాడు.

తలూపాను.

"ఇవేళ ఉదయం వచ్చారా?"

"మొన్న వచ్చాను. నిన్న సెలవు కాబట్టి ఇవేళ పనిలో చేరాను ఆఫీసులో పని ఎలా ఉంటుంది?"

"చేసేవాడికి పని తరగదు. పని ఎగ్గొట్టి తిరిగేవాడిని, కాస్త గట్టిగా మాట్లాడే వాడి ఎవరూ ఏమీ అనరు. మీ దేవూరు?"

చెప్పాను.

"ఈ ఉద్యోగంకోసం మీరింత దూరం రాకుండా ఉండవలసింది."

అతని ముఖంలోకి పరీక్షగా చూసి నవ్వి, "మీ రెందుకు వచ్చారు?"అడిగాను.

అతను గుండెనిండా పొగపీల్చి వదిలాడు. "నన్ను విశాఖపట్టణం నుండి రెండేళ్ళ క్రిందట ఇక్కడకు పనిష్మెంట్ మీద బదలీచేశారు." అని రెండు క్షణాలు మవునంగా ఉండి, "ఇప్పుడు నేనీ మహానగరానికి బానిసని. నన్ను ఇక్కడినుండి మళ్ళీ విశాఖపట్టణానికి బదలీచేస్తే వెళ్ళను. ఐ లవ్ బొంబాయి" అన్నాడు.

టీ వచ్చింది.

"మీరు ఎక్కడ ఉంటున్నారు?" అడిగాను.

"మాటుంగాలో."

"మీకు పెళ్ళి అయిందా?"

"లేదు. నా ముఖం చూడండి – ఎంత అసహ్యంగా ఉంటుందో? చూస్తూ చూస్తూ ఏ ఆడదీ నన్ను పెళ్ళిచేసుకోదు." అని పకపకమని నవ్వాడు.

నాకు అతనిమీద జాలివేసింది. కప్పు అందుకున్నాను "మిమ్మల్ని మీరెందుకూ కించపరుచుకుంటారు?" నెమ్మదిగా అన్నాను.

అతనేదో అనబోయి ఆగాడు. అనలేదు మవునంగా కప్పు ఖాళీచేసి చివరంటా కాలిన సిగరెట్‌తో మరో సిగరెట్ వెలిగించుకుని సిగరెట్ పీకను యాష్ ట్రేలో పడేశాడు. "ప్రస్తుతం మీరు ఎక్కడ ఉంటున్నారు?" అడిగాడు.

"వి.టి. స్టేషన్‌కు దగ్గరగా ఉన్న లాడ్జిలో ఉంటున్నాను."

"మీకు పెళ్ళి అయిందా?"

"అయింది."

"పిల్లలా?"

"ఒక బాబు.. మన ఆఫీసుకు దగ్గరలో ఇల్లు దొరకదా?"

"ఇక్కడ గదిని ఇల్లు అని అంటారు. మన ఆఫీసుకు దగ్గరలో గది దొరకటానికి ఏదయినా మిరకిల్ జరగాలి. లేకపోతే దొరకవు. సబర్బన్‌లో దొరుకుతాయి. మీ కిక్కడ బంధువులు కాని, తెలిసినవాళ్లు కాని లేరా?"

"లేరు."

"మీరు రెండు మూడు నెలలు ఆగండి. ఈ బొంబాయి జీవితం మీకు నచ్చితే గది కోసం ప్రయత్నం చేద్దాం. ఎక్క-



దొక్కడ దొరకకపోదు. అంతవరకు మీరు నా గదిలో ఉండటానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు టీ తాగండి. చల్లారిపోతుంది." అని చేతిగడియారం వంక చూసుకున్నాడు.

పది రోజుల తర్వాత లాడ్జి వదిలి అతని గదిలో చేరాను.

అయిదు నెలలు గడిచాక ఒకరోజు వెంటనే బయల్దేరి రమ్మని వాళ్ళూరినుండి దశరథానికి టెలిగ్రాం వచ్చింది. ఆ మధ్యాహ్నపు బండి పట్టుకుని అతను వెళ్ళిపోయాడు. వాళ్ళూరు చేరిన తర్వాత తను క్షేమంగా చేరినట్లు తెలియచేస్తూ తన పెళ్ళి నిశ్చయం అయినట్లు, త్వరలోనే శుభలేఖలు పంపిస్తానని రాశాడు. ఆ ఉత్తరం అందిన మూడోరోజున ఒక కట్ట శుభలేఖలు పంపించి తన స్నేహితుల పేర్ల జాబితా రాసి వాళ్ళకు వాటిని పంచి పెట్టమని కోరాడు తను రాసిన ఉత్తరం, పంపించిన శుభలేఖలూ అందినట్లు తెలియచేస్తూ శుభలేఖలు అతని మిత్రులకు అందించినట్లు ఉత్తరం రాశాను అతని పెళ్ళికి నేనూ కొంతమంది మిత్రులూ టెలిగ్రాములద్వారా శుభాకాంక్షలు తెలియచేశాం.

ఇది జరిగిన వారం రోజులకు నేను ఆఫీసునుండి గదికి తిరిగివచ్చేసరికి దశరథం గదిలో ముసుగుతన్ని పడుకొని ఉన్నాడు. కొత్త పెళ్ళికొడుకు అంత త్వరగా తిరిగి వచ్చేసినందుకు నాకు ఆశ్చర్యం వేసింది అతను నెలరోజుల పాటు సెలవు పొడిగిస్తాడని అనుకున్నాను చెప్పులు గోడవారగా విడిచాను తువ్వాలు అందుకుని ముఖం కడుక్కునేందుకు స్నానాల గదిలోకి వెళ్దామనుకునేంతలో అతను దుప్పటి తీసి లేచి గోడకానుకుని కూర్చున్నాడు అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి ఆగాను. మంచంమీదకు వంగి "కంగ్రాట్యులేషన్స్" అని నా కుడిచేయి ముందుకు చాపాను

అతని చేయి దుప్పటిలోంచి బయటకు రాలేదు. వాలిపోతున్న తల బలవంతంగా పయికెత్తి నా ముఖంలోకి చూసి, బాధగా నవ్వి, "నా పెళ్ళి జరగలేదు బ్రదర్" అన్నాడు.

ఉలిక్కి పడ్డాను అతని మాటలు ముద్దగా ఉన్నాయి. నాటు సారా వాసన గుప్పుమంటోంది. అతను సారా తాగుతా డన్న సంగతి నాకు అప్పుడే తెలిసింది అతను చెప్పిన విషయం నమ్మలేనట్లు తల అడ్డంగా ఆడించాను.

"నిజం బ్రదర్ నిజం నీతో నేను ఎప్పుడయినా అబద్ధాలు చెప్పానా? పీటంమీద పెళ్ళి ఆగిపోయింది అసలేం జరిగిందో చెప్పేదా?"

"చెప్పు" అన్నాను.

"పెళ్ళికూతురు మెడలో తాళి కట్ట బోతుంటే ఆ మహాతల్లి నా ముఖంలోకి తేరిపార చూసింది. అంతే నన్ను తాళి కట్టనీయలేదు పీటమీంచి లేచి విలబడి 'తర్' పెళ్ళి జరగటానికి వీలులేదంటే వీల్లేదు' అంది. 'ఎందుకు?' అని ఆవిడను ఎవరూ అడగలేదు. ఆవిడ చెప్పనూ లేదు కారణం నేను ఊహించగలను. ఆవిడను నేను తప్పుపట్టటంలేదు. అయితే ఒహటి ఆవిడ తన అయిష్టత చివరి నిమిషంలోకాక ముందే తెలియచేసి ఉంటే నాకింత హ్యూమిలేషన్ ఉండకపోను అంతకుముందు పెళ్ళివరకు వచ్చి ఆగి పోయిన సంఘటనలు మూడు జరిగాయి. ఓ బ్రదర్! నా ముఖం చూసిన ఏ స్త్రీ నన్ను పెళ్ళిచేసుకోవటానికి వప్పుకోదు. నాకీ జన్మలో పెళ్ళికాదు. అంతే!" అని చొక్కా జేబులోంచి మంగళసూత్రం తీసి ఎదుటి గోడకేసి విసిరికొట్టాడు. వెంటనే రెండుచేతులతో ముఖం కప్పుకుని ఏడవటం మొదలుపెట్టాడు.

మంచంమీద కూర్చున్నాను. జాలిగా చూస్తూ అతని భుజంమీద చేయివేశాను అతన్ని ఎలా ఓదార్చాలో నాకు అర్థం కావటంలేదు చాలాసేపటి వరకు అతని భుజాన్ని నిమురుతూ ఉండిపోయాను

పయి సంఘటన జరిగిన నెలరోజుల తర్వాత మా ఊళ్ళోని కాలేజీలో నాకు ఉద్యోగం దొరకటం వలన బొంబాయి ఉద్యోగానికి రాజీనామాచేసి మా ఊరు వచ్చేశాను

* * *

మెట్లు ఎక్కుతూ చేతిగడియారం వంక చూసుకున్నాను ఆరూ అయిదయింది నేను ప్లాట్‌ఫాం మీదకు వచ్చేసరికి బొంబాయి ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లోకి వస్తోంది

బండి ఆగింది. ఒక్కో పెట్టె చూస్తూ చివరిపెట్టె దగ్గరకు వచ్చి ఆగాను. కిటికీ లోంచి లోపలకు చూశాను పెట్టె ముప్పాతిక వంతుగా ఖాళీ అయి ఉంది కిటికీ ప్రక్కనే ఉన్న సీటులో దశరథం కూర్చుని ఉన్నాడు. అతని కుడిచేయి ఎదుటి సీట్లో కూర్చునివున్న సాధువు చేతుల్లో ఉంది. సాధువు కాషాయరంగు దుస్తులు వేసుకుని ఉన్నాడు సాధువు లావుపాటి అద్దంతో దశరథం చేతిలోని రేఖలను పరీక్షగా చూస్తున్నాడు. దశ రథాన్ని పిలుద్దామని నోటి చివరంటా వచ్చింది. ఆగాను

ఆ సమయంలో—

దశరథం నోరు తెరిచాడు. నాలుకతో తన లావుపాటి క్రింద పెదవిని ఒకసారి తడుపుకుని, "స్వామీ! నా పెళ్ళి ఏ సంవత్సరంలో అవుతుందో చెప్పగలరా?" అని అడుగుతున్నాడు.

—•—